

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

## రజతోత్సవ సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో వణుకు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్**

సిరిసిల్ల టౌన్, మే 3 : బీఆర్ఎస్ కేసీఆర్ నాయకత్వంలో నిర్వహించిన రజతోత్సవ సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో వణుకు పుట్టిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలుకాకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందనడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది విద్యార్థులు అమరులయ్యారని, చావునోట్లో తలపెట్టి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. సాధించిన తెలంగాణను పదేండ్లపాలనలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిపారన్నారు. కేసీఆర్‌ను విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకులు చూస్తూ ఊరుకోబోరని స్పష్టం చేశారు. మరోసారి కాంగ్రెస్ నాయకులు విమర్శలు పునరావృతమైతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన 420 హామీలు అమలయ్యే వరకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్, అనిల్, మహేశ్, అఫ్రోజ్, నవీన్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

### భూ నష్టపరిహారం అడిగినందుకు
## రైతుపై ఫిర్యాదు చేయడం అన్యాయం


మాట్లాడుతున్న ధర్మాసమాజ్ పార్టీ నాయకులు, రైతులు

రుద్రంగి, మే 3: రుద్రంగిలో సురమ్మ ప్రాజెక్టు వెళ్లే ఎల్లంపెల్లి వరద కాల్వ పనుల్లో భూములు కోల్పోయిన రైతులు భూ నష్టపరిహారం అడిగినందుకు రైతులపై అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం అన్యాయమని ధర్మాసమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్ అన్నారు. మండలకేంద్రంలో వరద కాల్వ పనుల్లో భూములు కోల్పోయిన రైతులు విలేకరులతో సమావేశం నిర్వహించారు. బాధితులకు ధర్మాసమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, జీవనోపాధి అయినటువంటి వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలను కోల్పోయిన తమకు భూ సేకరణ చట్టం 2013 ప్రకారం.. నష్టపరిహారం చెల్లించాలని అడిగినందుకు తమపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ధర్మాసమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్ మాట్లాడుతూ, ఎల్లంపెల్లి ప్రాజెక్టు వరద కాల్వ పనుల్లో చాలా మంది రైతులకు చెందిన ఇండ్లు, వ్యవసాయ భూములు ముంపునకు గురవుతుందన్నారు. నష్టపరిహారం చెల్లించాలని పలుమార్లు అధికారులను విన్నవించుకున్నా లాభం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు భూ సేకరణ చట్టం 2013 ప్రకారం.. నష్టపరిహారం చెల్లించి రైతులకు న్యాయం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దులు, ఉదయ్, రమేశ్, రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం డబ్బులు ఇంకెప్పుడు జమచేస్తరు?

- వడ్లు కొనుగోలు చేసి 20రోజులు దాటినా జమకాని నగదు
- ఆందోళనలో అన్నదాతలు
- వెంటనే జమ చేయాలని విజ్ఞప్తి

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, మే 3: కొనుగోలు కేంద్రాలు వడ్లు కాంటా పెట్టి 25రోజులు దాటినా బ్యాంకు ఖాతాలో ధాన్యం డబ్బులు జమకాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు గ్యారెంటీతో రైస్‌మిల్లర్లు మొదట వెనక్కి తగ్గడంతో కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అధికారులు కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టారు. సదరు ధాన్యాన్ని అప్పారెల్ పార్క్, సర్దాపూర్, బొప్పాపూర్ వ్యవసాయ గోదాములకు తరలించారు. తర్వాత మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు చెల్లించిన తర్వాత కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించారు. మొదట గోదాములకు తరలించిన ధాన్యానికి సంబంధించిన ట్రక్‌షీట్ రాకపోవడం, రైతుకు ఓటీపీ పంపకపోవడంతో సదరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే నగదు జమ అయ్యేవని చెబుతున్నారు. ప్రస్తుతం వడ్ల కాంటా పెట్టి 25దాటినా డబ్బులు జమ కాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం మల్లేశంను వివరణ కోరగా, మొదట కొన్ని వడ్లు గోదాములకు పంపించామని, సాంకేతిక కారణాలతో పూర్తి డాటా పూర్తిచేయలేక పోయామని తెలిపారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు.

### ఉద్దెరిచ్చినోళ్లు పైసలడుగుతున్నరు



పంట కోసం మందు బస్తాలు ఉద్దెరిచ్చినోళ్లు, దున్నినోళ్లు, వరి కోసినోళ్లు పైసలు అడుగుతున్నరు. ఫస్ట్ కాంట మా ఊర్లె నేనే పెట్టిన. ఇప్పటిదాక పైసలు పడలే. 350 బస్తాల వడ్లు అమ్మిన. ఇంతకు ముందు గవుర్మెంట్ల రెండు, మూడు రోజులల్ల పైసలు పడ్తుండె. ఇప్పుడు 25రోజులైంది. ఇప్పటిదాకా పైసలు రాలే. ఇట్లయితె ఇంట ఖర్సులెట్ల ఎల్లుతయ్, నెల నెల చిట్టీలు ఎట్ల కట్టుడు. ఏమీ అర్థమైతలేదు.

**- బానోత్ సరోజ, కిష్టూనాయక్ తండా (ఎల్లారెడ్డిపేట)**

### కాంటాపెట్టి 15 రోజులు అయితాంది



మాది చిప్పలపల్లి. మా గ్రామంలో ఐకేపీ సెంటర్ ఓపెన్ చేసి 25రోజులు అవుతుంది. సెంటర్ ఓపెన్ చేసిన మొదటి రోజే నా పేరు మీద 50క్వింటాళ్లు, మా నాన్న పేరు మీద 22క్వింటాళ్లు కాంటాపెట్టి 15రోజులు కావొస్తున్నది. ఇప్పటివరకు ఓటీపీ రాలేదు.. ఓటీపీ అడిగిన నాథుడు లేడు. డబ్బుల ఊసే లేదు. గతంలో వడ్లు కొన్న మరుసటి రోజే ఓటీపీ అడిగేవారు. ఐదారు రోజుల్లో డబ్బులు జమ అయ్యేటివి. కానీ ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాలి.

**- తాడెపు ఎల్లం, చిప్పలపల్లి (ముస్తాబాద్)**


చెక్కును అందజేస్తున్న కలెక్టర్

## కలెక్టర్ ఆర్థిక చేయూత

కలెక్టరేట్, మే 3: అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలకు కలెక్టర్ ఆర్థిక చేయూత అందించారు. అనారోగ్య, ఆర్థిక కారణాలతో తాము ఇబ్బంది పడుతున్నామని, తమను ఆదుకోవాలని, ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన సింగం నర్సయ్య విన్నవించారు. ఆయా కుటుంబాల స్థితిగతులు చూసి చలించిన కలెక్టర్ వెంటనే ఆర్థిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను శనివారం అందజేశారు. ఆయా కుటుంబాల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నేడు మల్కపేట రిజార్వాయర్ నుంచి నీటి విడుదల

రాజన్న సిరిసిల్ల, మే3 (నమస్తే తెలంగాణ): కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా పంటలకు నీరందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం 9వ ప్యాకేజీలో భాగంగా మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు టన్నెల్‌ద్వారా నీటిని నింపారు. ఇటీవల ట్రయల్ రన్ చేపట్టిన అధికారులు తొలివిడుతగా ఎడుమ కాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని పంట చేలకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే.. నేడు కుడి కాల్వ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని 12గ్రామాల్లోని 25,654 ఎకరాలకు సాగునీరందించడంకు 350 క్యూసెక్కుల సామర్థ్యం గల కాల్వ ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నీటిని విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కుడి కాల్వ ద్వారా విడుదల చేస్తున్న నీటితో కోనరావుపేట మండలంలోని మల్కపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, వేములవాడ మండలంలోని మారుపాక తదితర గ్రామాలకు నీటి ఎద్దడి తీరనున్నట్లు అధికారులు వెల్లడించారు. పలు గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి ఈ నీటి విడుదల ద్వారా తీరే అవకాశం ఉంది.మల్కపేట రిజర్వాయర్ నుంచి మారుపాక గ్రామం వరకు 9కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన ఈ కాల్వలో ఇప్పటి వరకు నీటి చుక్క లేదు. నీటి విడుదలతో పలు గ్రామాలకు సాగు, తాగునీరందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

సిరిసిల్ల రూరల్, మే 3 : పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని తంగళ్లపల్లి మండలం తాడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం బీ రవీందర్ అన్నారు. తంగళ్లపల్లి మండలం తాడూరులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో విద్యార్థి వెల్పుల రేవంత్ 541 మార్కులు సాధించి, మండలంలో మూడోస్థానంలో నిలిచాడు. దీంతో శనివారం గ్రామానికి చెందిన రిటైర్డ్ కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ వీ వెంకటరమణారావు విద్యార్థి రేవంత్‌కు రూ. 5116 నగదు ప్రోత్సాహకంతోపాటు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఆగస్టు 15న పాఠశాలలో ప్రకటించినట్లుగా, పది ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన రేవంత్‌కు ప్రోత్సాహక బహుమతి అందించినట్లు పేర్కొన్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రోత్సాహక బహుమతి అందించినట్లు వెంకటరమణరావు తెలిపారు. సురభి నవీన్‌రావు, రాజు, ఉపాధ్యాయులు మనోహర్, రవి ఉన్నారు.


ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న వెంకటరమణారావు

## ధాన్యం సేకరణకు అనువైన స్థలం కేటాయించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

చందుర్తి, మే3: ధాన్యం సేకరణకు అనువైన స్థలం కేటాయించి, ప్రమాదాల భారిన నుంచి రైతులను, ప్రజలను ఆదుకోవాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలకేంద్రంలో ధాన్యం సేకరణకు అనువైన స్థలాన్ని కేటాయించి రైతులను ఆదుకోవాలని సూచించారు. ఏళ్లు గడిచినా స్థలం కేటాయింపులో జాప్యంపై వాహనదారులు మృతి చెందిన ఘటనలను గుర్తు చేశారు. అధికారులకు విన్నవించినా సమస్యల పరిష్కారంలో దృష్టి సారించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలతో పాటు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని కనీసం 20 ఎకరాల్లో మార్కెట్ యార్డ్ నిర్మాణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రైతు సంఘం నేతలు, రైతులు పాల్గొన్నారు.

## అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల హవా

**బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి**

ఇల్లంతకుంట, మే 3 : మండలంలో అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు సభా వేదికపై ఆసీనులు కావడం ద్వారా ఇది పార్టీ కార్యక్రమా, ప్రభుత్వ కార్యక్రమా అనే అనుమానం ప్రజలను వేదిస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి శనివారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శుక్రవారం అనంతారం గ్రామంలో నిర్వహించిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించి, కలెక్టర్, మండల తహసీల్దార్, ఎంపీడీవో తో పాటు మండల కాంగ్రెస్ నాయకులను సభావేదికపై కూర్చోబెట్టడం సరి కాదన్నారు. దీనిపై కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు రాక ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైదన్నారు. ప్రజలకు దీనిపై ఎమ్మెల్యే సమాదానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా అధికారిక కార్యక్రమాలను అధికారికంగానే చూడాలని వాటిని పార్టీ నాయకులతో పార్టీ సమావేశంగా మార్చవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాదుల్, రఘు, మధు ఉన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి

### కొనసాగుతున్న స్వర్ణకారుల రిలే నిరాహార దీక్ష

ముస్తాబాద్, ఏప్రిల్ 3 : మండలం కేంద్రంలో బడా వ్యాపారులకు బంగారు ఆభరణాల దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దని మండల కేంద్రంలో స్వర్ణకారులు చేస్తున్న రిలే నిరాహర దీక్షలు శనివారం 10వ రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ, స్థానిక స్వర్ణకారులు కుల వృత్తిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకున్నామని ఇటీవల ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద వ్యాపారులు కోట్ల పెట్టుబడులతో బంగారు దుకాణాలు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారి దుకాణలకు అనుమతులు ఇవ్వొదని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న స్వర్ణకారులు

### తంగళ్లపల్లిలో కళాకారుల ప్రదర్శన

సిరిసిల్ల రూరల్, మే 3 : మండల కేంద్రంలో భూ భారతి, స్వచ్ఛదనం, పచ్చదనం, వేసవి జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతి సారథి గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కళాకారులు కళా ప్రదర్శనలు చేశారు. ప్రతి ఒక్కరూ చెట్లు ఇంటి ముందు పెంచుకోవాలన్నారు. కళాకారులు శ్రీరాములు రామచంద్రం, ఎడ్మల శ్రీధర్ రెడ్డి, గుగ్గిల్ల పర్శరాములు, వంతడపుల గణేశ్ ఉన్నారు.

### ప్రమాద బీమా చెక్కు పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మే 3 : కోరుట్లపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బీ ఎల్లవ్వ రెండేండ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన ప్రమాద బీమా చెక్కును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. శనివారం కోరుట్లపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు లోకుర్తి బాలమల్లు, అందె సుభాష్, నర్సింహారెడ్డి, సింగారపు మధు, తిరుపతిరావు, రఘునందన్‌రావు తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు సన్మానం

వేములవాడ రూరల్, మే 3 : మండలంలోని బొల్లారంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పవర్‌యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ వద్ద నిర్వహించిన సమావేశంలో మధుమిత 526, మహంత్ 511, అక్షయ 480, ఐశ్వర్య 454 మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించారు. పవర్‌యూత్ అధ్యక్షుడు రాకేశ్, మాజీ సర్పంచ్ మల్లేశం, అనిల్ తదితరులున్నారు.

## ప్రాచీన కళలను కాపాడుకోవాలి

చందుర్తి, మే 3: అంతరించిపోతున్న గ్రామీణ కళలు, కళారూపాలను కాపాడుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కల తపస్వీ ఎల్ల పోశెట్టి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నటరాజ కళమండలి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీ చిరుతల రామాయణ నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రాచీన కళలు, కళారూపాలకు ఎంతో ప్రాచుర్యం ఉండేదని, పూర్వకాలంలో పౌరాణిక నాటకాలు,గ్రామీణ కళా ప్రదర్శనలు,ఒగ్గు కథలను ప్రజలు ఆదరించే వారని తెలిపారు. సాంకేతిక విప్లవంతో ఆయా కళలు నాటకాలకు ఆదరణ కరువైందని వాటిని నమ్ముకుని ఉపాధి పొందే కళాకారులు బతుకుదెరువు కోసం వలస బాట పట్టారని అన్నారు. ప్రజా చైతన్య కార్యక్రమాల్లో కళాకారుల పాత్ర కీలకమని అన్నారు.నేటి ఆధునిక సమాజానికి కళా ప్రదర్శనను అందిస్తున్న కళాకారులను అభినందించారు.ప్రభుత్వం ప్రాచీన కళలను ప్రోత్సహిస్తూ, కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఇక్కడ నటరాజ కళామండలి సభ్యులతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చందుర్తి, మే 3 : మండలవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వానికి లక్షల రూపాయలు గండిపడుతున్నది. సామాన్యులు ప్రభుత్వానికి చలాన్ కట్టినా దొరకని ఇసుక.. అక్రమదారులకు మాత్రం సులభంగా లభించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగంగానే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చర్య తీసుకోవడంలో వెనుకడుగు వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రశ్నించిన యువకుడిపై దాడి..**

మండలంలోని మర్రిగడ్డలో ఇటీవల ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ఓ యువకుడిపై ఓ మాజీ ప్రజా ప్రతినిధి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ పంట పొలాలను ఆనుకొని ఉన్న కాల్వ నుంచి ఇసుక అక్రమ రవాణా చేయడంతో భూ గర్భ జలాలు అడుగంటుతున్నాయని యువకుడు మాజీ ప్రజా ప్రతినిధిని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన సదరు వ్యక్తి యువకుడిపై దాడి చేయగా, మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## అదను దొరికిందని అందిన కాడికి..

- ఇసుక విక్రయదారుల అడ్డగోలు వసూలు
- ట్రిప్పనకు రూ.3 వేల నుంచి 4 వేలు
- విలవిలలాడుతున్న మిడిల్ క్లాస్

ఎల్లారెడ్డిపేట, మే 3: మండలంలోని ఇసుక రీచ్‌ల ఏర్పాటు విషయంలో అధికారులు చేస్తున్న తప్పటడుగులతో ఇండ్లు నిర్మాణం చేసుకుందామనుకుంటున్న మధ్యతరగతి వర్గాలకు చుక్కలు కనిపిస్తుండగా, ఆ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పదిరకు రీచ్‌కు అనుమతించి, మిగతా రీచ్‌లను నిలిపివేసిన క్రమంలో లేక లేక వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్న తడువే అందినకాడికీ దోపిడీ చేసేందుకు దారులు వెదుక్కుంటున్నారు. గతంలో నారాయణపూర్, రాగట్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట పరిసర గ్రామాలకు ఇసుక తీసుకెళ్లితే రూ.18 వందల నుంచి రూ. 2వేలకు ట్రిప్పుగా తీసుకునేది. కాని, ఇటీవల రీచ్‌లన్నీ నిలిపివేయడంతో ఇసుక డిమాండ్ పెరిగింది. అదే సమయంలో పదిరకు ఇవ్వడంతో ఇక ఇసుకకు తమ రీచే దిక్కని గమనించిన ఇసుక రవాణా దారులు ట్రిప్పుకు రూ.3వేల నుంచి 4వేలు వసూలు చేయడం మొదలు పెట్టారు. ఇదే సమయంలో వెంకటాపూర్ రీచ్‌కు ఇవ్వడంతో గతంలో రూ. 25 వందలకు ఇసుకను రవాణా చేసిన వాల్లు సైతం అదే తీరు రూ.3 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. నారాయణపూర్ రీచ్‌కు ఇసుకను అనుమతించక పోవడంతో ప్రజలు అందుబాటు ధరలో ఇసుక లేక ఎంత ఇబ్బంది పడుతున్నారో తెలిపేందుకు శనివారం తహసీల్దారు సుజాతను పలువురు నాయకులు కలిసి అధిక ధరల వసూళ్లపై అడిగారు. నారాయణపూర్‌కు రీచ్‌ను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ముందుకెళ్లాలి

**'పది'లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన**

కలెక్టరేట్, మే 3: విద్యార్థులు పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శనివారం కలెక్టరేట్‌లో అభినందించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు విష్ణుప్రియ 580, విగ్నారెడ్డి 573, వైష్ణవి 553, అలేఖ్య 551 మార్కులు సాధించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిహర్షిత్ 573, భానుతేజ 562, నవజీత్ 561, సుశృత 558, కావ్య 545, మైత్రి 531, భవ్య 535 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE



★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

### వాహనాల తనిఖీ

బోయినిపల్లి, మే 3 : మండలంలోని కొదురుపాక ఎక్స్ రోడ్డులో శనివారం జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్ ఆకస్మికంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ, రాష్ట్ర రోడ్డు రవాణా వాహనాలను ఆపి డ్రైవర్ లైసెన్స్, కండక్టర్ లైసెన్స్ తనిఖీ చేసినట్లు తెలిపారు. డ్రైవర్లు బస్సు నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని, పక్కా ప్రయాణికులతో ముచ్చటించద్దని కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. లైసెన్స్ లేని రెండు ఆర్టీసీ బస్సులపై కేసు రాయడం జరిగిందన్నారు. పత్రాలు లేని మూడు సరకుల రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి బోయినిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రవాణా శాఖ సిబ్బంది సౌమ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేట, మే 3: మండలంలోని ఆయా బీఆర్ఎస్ బాధిత కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. మండల కేంద్రంలోని బరిగెల ప్రవీణ్, గంద్యాడపు గాలయ్య, శ్రీగాధలో చొక్కారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, నేతలు కమ్మరి రాజారాం, వెంకటియాదవ్, రాజు, కమలాకర్‌రెడ్డి, భిక్షపతి, మహేందర్, స్వామి ఉన్నారు.

### మొక్కలు నాటిన చిన్నారి

బోయినిపల్లి రూరల్, మే 3 : మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా హరితసేన కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినిపల్లి మండలం తడగొండకు చెందిన ఉయ్యాల బాలరాజు కుమార్తె మనశ్విత జన్మదినం సందర్భంగా ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ భాగస్వామ్యం కావాలన్నారు.

### వ్యవసాయ కళాశాల విద్యార్థుల సేవ శిబిరం

బోయినిపల్లి రూరల్, మే 3 : మండలంలోని తడగొండలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు మాధవి, అరుణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### తంగళ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల రూరల్, మే 3 : మండలకేంద్రంలో శనివారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మార్కండేయ ఆలయంలోని సమావేశ మందిరంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హమీద్, సిరిసిల్లలోని అపోలో డయోగ్నిస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికిపైగా ఉచితంగా షుగర్‌తో పాటు కొల్‌స్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. పద్మశాలీ సంఘ అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, ఆపోలో డయోగ్నిస్టిక్ సభ్యులు రాజు, పాతూరి సర్కార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### పల్లె దవాఖానకు కూలర్ అందజేత

ఇల్లంతకుంట, మే 3 : మండలకేంద్రంలోని పల్లె దవాఖానకు మాజీ ఎంపీటీసీ ఎంద్రం తిరుపతిరెడ్డి శనివారం కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లె దవాఖానలో అధికారులు ఎండవేడికి తట్టుకోవడం లేదని వారికి చల్లటి గాలి అందించడం కోసం కూలర్‌ను అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా దవాఖానకు వచ్చే రోగుల కోసం చలివేంద్రం ఏర్పాట చేశామన్నారు. మండల కేంద్రంలో 50 పడకల దవాఖాన నిర్మాణానికి ఎమ్మెల్యే వెంటనే చొరవ చూపి మండల ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.

### పెన్షన్ కోసం వెళ్తుండగా.. వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 3 : బాకుర్‌పల్లికి చెందిన రమావత్ లింబ్యా వృద్ధుడు పెన్షన్ కోసం వెళ్తుండగా ఓ బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింబ్యా గొల్లపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో వృద్ధాప్య పెన్షన్ డబ్బులు తీసుకుందామని రోడ్డు దాటుతున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తున్న బొలేరో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బాధితుడి చికిత్స కోసం 108లో మండల కేంద్రంలోని ఓ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడ నుంచి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటన వివరాలను నమోదు చేసుకున్నారు. బాల్యా కుమారుడు మోహన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషనరీ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

### గంభీరావుపేటలో బంద్ ప్రశాంతం

గంభీరావుపేట, మే 3: మండల కేంద్రంలోని హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపు మేరకు.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వ్యాపార దుఖాణాలు, హోటళ్లను మూసి ఉంచి యజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌కు అఖిల పక్ష పార్టీల నేతలు మద్దతు పలికారు. తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. గ్రామస్తులు ప్రసాద్‌రెడ్డి, రాచర్ల పార్థసారధి, కృష్ణకాంత్‌యాదవ్, అశోక్, లక్కిరెడ్డి కమలాకర్డ్డి ఉన్నారు.

### గ్రామాల ప్రశాంతతలో యువత ప్రాత కీలకం

ముస్తాబాద్, మే 3: గ్రామాల ప్రశాంతతలో యువకుల ప్రాత కీలకమని ఎస్ఐ గణేశ్ అన్నారు. మండలంలోని చిప్పలపల్లిలో ఇటీవల గ్రామస్తులు గ్రామ సంరక్షణ కోసం గ్రామంలోని యువకులను గ్రామ రక్షక దళాలుగా ఏర్పాటు చేసి, రాత్రి సమయంలో రక్షణ కోసం గస్తీ తిరుగేందుకు ఏర్పాటు చేసిన యువకులను అభినందించారు. గ్రామ మాజీ సర్పంచ్ దేవయ్య యువకులకు క్యారంబోర్డు వితరణ చేయగా, ఎస్ఐ చేతుల మీదుగా అందించారు. యువతతో పాటు సహకరించిన దేవయ్యను అభినందించారు.

### వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

వేములవాడ, మే 3: వేములవాడలో వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగమరావు, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారు కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి జూన్ 6 వరకు వేములవాడలో ఈ ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 9177259935ను సంప్రదించాలన్నారు.